RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 95 | ఏప్రిల్ 25 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 95 | April 25 Saturday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


సమ్మెలో ఉద్రిక్త పరిస్థితులు

2

## 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్'

# పాలసీ ఏకాభిప్రాయంతోనే అమలు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం



**హైదరాబాద్ జనసంఘర్షణ**

హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్' పాలసీని పారిశ్రామికవేత్తల ఏకాభిప్రాయంతోనే అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఆదాయ వనరుల సమీకరణ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలించి, అక్కడ చైనా తరహాలో అత్యాధునిక ఇండస్ట్రియల్ బ్లాకులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కొత్త పారిశ్రామిక విధానంలో కార్మికుల వసతి కోసం డార్మెటరీల నిర్మాణాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ సమావేశంలో భూముల మార్కెట్ విలువల సవరణపై కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు. మే మొదటి వారం నుండి రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ ధరలు పెరగనున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ భూముల విలువ ప్రస్తుతం ఉన్న దానికంటే రెండు నుండి మూడు రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఉదాహరణకు, ఎకరాకు ఆరు లక్షల రూపాయలుగా ఉన్న కనీస విలువ 12 నుండి 18 లక్షల రూపాయల వరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుందని, ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని భట్టి విక్రమార్క వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావులతో పాటు వివిధ పారిశ్రామిక వాడల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ శంకర్ మృతిపై సీఎం దిగ్భ్రాంతి



**హైదరాబాద్ జనసంఘర్షణ**

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో చోటుచేసుకున్న తీవ్ర విషాదకర ఘటనలో నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ (55) ప్రాణాలు కోల్పోయారు. సమ్మెపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా గురువారం నర్సంపేట డిపో ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆయన, హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. 80 శాతం కాలిన గాయాలతో ఉన్న ఆయన్ని మెరుగైన చికిత్స కోసం వరంగల్ నుండి హైదరాబాద్ తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని

➤ మిగతా 2వ పేజిలో..

## మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు

### ముగ్గురు మృతి

**మణిపూర్ జనసంఘర్షణ**

మణిపూర్‌లో కుకీ, నాగా తెగల మధ్య మరోసారి హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉక్రుల్ జిల్లాలో శుక్రవారం జరిగిన ఈ ఘర్షణల్లో ముగ్గురు వ్యక్తులు మరణించగా, పలువురు గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు కుకీ తెగకు చెందిన వారు కాగా, ఒకరు నాగా తెగకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుకీ మానవ హక్కుల సంస్థల కథనం ప్రకారం.. ముల్లామ్, షోంగ్ఫల్ గ్రామాల్లోని కుకీ నివాసాలపై తెల్లవారుజామున నాగా తెగకు చెందిన సాయుధులు దాడులకు పాల్పడ్డారు. నిద్రలో ఉన్న సమయాన జరిగిన ఈ దాడిలో ఇద్దరు మరణించడమే కాకుండా, పలు ఇండ్లు దహనమయ్యాయని, మహిళలు, పిల్లలు గాయపడ్డారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, నాగా తెగ ప్రతినిధులు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. తమ దళాలు గస్తీ నిర్వహిస్తుండగా కుకీ వర్గీయులే తొలుత కాల్పులకు తెగబడ్డారని, ఈ క్రమంలో

➤ మిగతా 2వ పేజిలో..

## హుగ్లీనదిలో ప్రధాని పడవ ప్రయాణం



**కలకత్తా జనసంఘర్షణ.**

పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం కోల్‌కతాలోని హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. ఈ పర్యటనకు సంబంధించిన అందమైన ఛాయాచిత్రాలను ఆయన స్వయంగా తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పంచుకున్నారు. హుగ్లీ నది కేవలం జలవనరు మాత్రమే కాదని, అది బెంగాలీ సంస్కృతి మరియు జీవన విధానంతో విడదీయలేని బంధాన్ని కలిగి ఉందని ఈ సందర్భంగా మోదీ కొనియాడారు. గంగానది జలాలు ప్రాచీన నాగరికత స్ఫూర్తిని చాటిచెబుతాయని, బెంగాలీల జీవితాల్లో ఆ నదికి ఉన్న ప్రాముఖ్యత అపారమని ఆయన పేర్కొన్నారు. నదీ విహార సమయంలో హుగ్లీ తీరంలో ఉదయపు నడకకు వచ్చిన వారితో మరియు పడవ నడిపేవారితో ప్రధాని సరదాగా ముచ్చటించారు. శ్రామిక శక్తి యొక్క గొప్పతనాన్ని ప్రశంసిస్తూనే, పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. చారిత్రక విద్యాసాగర సేతు, హౌవ్‌డా వంతెనల దృశ్యాలను దగ్గరి నుండి వీక్షించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, హుగ్లీ ఒడ్డున గడిపిన ఈ సమయం తనకు చిరస్మరణీయంగా నిలిచిపోతుందని ప్రధాని మోదీ తన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

➤ మిగతా 2వ పేజిలో..

## 'గోల్డ్ కార్డ్' పథకానికి రాని ఫలితం

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ట్రంప్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'గోల్డ్ కార్డ్' పథకం ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదని తాజా గణాంకాలు చెబుతున్నాయి. అమెరికాలో శాశ్వత నివాసం పొందాలనుకునే విదేశీయుల కోసం గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించిన ఈ పథకం కింద, నాలుగు నెలలు గడిచినా ఇప్పటివరకు కేవలం ఒక్కరికి మాత్రమే కార్డు జారీ అయినట్లు అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హవార్డ్ లూట్నిక్ స్వయంగా వెల్లడించారు. వాషింగ్టన్‌లో జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలను తెలియజేస్తూ, ప్రస్తుతం వందలాది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఒక మిలియన్ డాలర్ల ఫీజు చెల్లించి, అదనపు ప్రాసెసింగ్ ఖర్చులతో కూడిన ఈ పథకంపై మొదట్లో భారీ అంచనాలు ఉండేవని, సుమారు 1.3 బిలియన్ డాలర్ల విలువైన లావాదేవీలు జరుగుతాయని భావించినప్పటికీ, క్షేత్రస్థాయిలో జారీ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఐదేళ్లలోనే పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే వీలు కల్పించే ఈ పథకం కోసం అధికారులు ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయి వ్యవస్థను సిద్ధం చేశారని, ఎలాంటి

➤ మిగతా 2వ పేజిలో..

## పేటీఎంకు ఆర్‌బీఐ భారీ షాక్




**బొంబాయి జనసంఘర్షణ**

ప్రముఖ ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎంకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారీ షాక్ ఇచ్చింది. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తూ ఆర్‌బీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఇకపై అన్ని రకాల బ్యాంకింగ్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. గత కొంతకాలంగా ఈ బ్యాంక్ తీరుపై అసంతృప్తిగా ఉన్న కేంద్ర బ్యాంకు, ఇప్పటికే కొత్త కస్టమర్లను చేర్చుకోవడంతో పాటు డిపాజిట్ల సేకరణపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా లైసెన్స్ రద్దు చేయడంతో ఆ సంస్థకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. బ్యాంక్ మేనేజ్‌మెంట్ వ్యవహారశైలి డిపాజిటర్ల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, నిబంధనలను పాటించడంలో పదేపదే విఫలమవుతోందని ఆర్‌బీఐ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ క్రమంలో బ్యాంక్ కార్యకలాపాలను ఇకపై కొనసాగించడం భావ్యం కాదని భావించి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. బ్యాంకింగ్ సేవల మూసివేత ప్రక్రియపై హైకోర్టులో దరఖాస్తు చేస్తామని పేర్కొన్న ఆర్‌బీఐ, డిపాజిటర్లకు ఉన్న నిధుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి చెల్లించడానికి సరిపడా నిధులు బ్యాంక్ వద్ద ఉన్నాయని భరోసా ఇచ్చింది. డిజిటల్ ఫైనాన్స్ రంగంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఇన్వెస్టర్లలో మరియు వినియోగదారులలో చర్చనీయాంశంగా మారింది.

## ఆమ్‌ఆద్మీకి రాజీనామా



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ఆమ్ ఆద్మీ పార్టీ రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా భారీ కుదుపునకు గురైంది. ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు కీలక నిర్ణయం తీసుకోవడంతో పార్టీ ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి తలెత్తింది. రాజ్యసభలో ఆప్ డిప్యూటీ లీడర్‌గా ఉన్న అశోక్ కుమార్ మిట్టల్‌తో పాటు మరో ఇద్దరు కీలక ఎంపీలు రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించారు. తాము ముగ్గురం కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు వారు అధికారికంగా వెల్లడించారు. రాజ్యసభలో ఆప్ సభ్యత్వ బలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, మూడింట రెండు వంతుల మంది సభ్యులు ఇలా ఒక్కసారిగా పార్టీని వీడటం ఆ పార్టీకి చావుదెబ్బ వంటిదేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా పార్టీలో అత్యంత కీలక నేతగా ఎదిగిన రాఘవ్ చద్దా ఈ సందర్భంగా పార్టీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత 15 ఏళ్లుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించానని, రక్తం చెమట చిందించి పార్టీ ఎదుగుదలకు కృషి చేశానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ తన ఆదర్శాలను, విలువలను పూర్తిగా వదిలేసిందని, కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేస్తోందని ఆయన ఆరోపించారు. తాను ఒక సరైన వ్యక్తిగా ఉండి తప్పుడు పార్టీలో కొనసాగుతున్నానని భావించినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా

➤ మిగతా 2వ పేజిలో..

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్

# మృతిపై సీఎం దిగ్భ్రాంతి

**మొదటిపేజీ తరువాయి..** బంధువులకు అప్పగించగా, అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. శంకర్ గౌడ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఎవరూ కూడా క్షణికావేశంలో ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ఆయన కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం సంతాపం వ్యక్తం చేస్తూ, కార్మికులు ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ప్రాణాలు తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని ఆయన హితవు పలికారు.

# 'గోల్డ్ కార్డ్' పథకానికి

# రాని ఫలితం

**మొదటిపేజీ తరువాయి..** సాంకేతిక లోపాలు లేకుండా జాగ్రత్తగా దరఖాస్తులను పరిశీలిస్తున్నామని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ, నిబంధనల కఠినత వల్లే జారీలో జాప్యం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

# మణిపూర్‌లో

# మళ్లీ ఘర్షణలు

**మొదటిపేజీ తరువాయి..** తమ వాలంటీర్ ఒకరు ప్రాణాలు కోల్పోయారని వారు పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసమే తాము ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని వివరించారు. పరస్పర దాడులతో ఉద్రిక్తంగా మారిన ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు భారీగా మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈ రెండు తెగల మధ్య వైరం తాజా ఘటనతో మరోసారి భయానక వాతావరణాన్ని సృష్టించింది.

## ఆస్పత్రిలో మృతదేహంపై ఆభరణాలు చోరీ

**జగిత్యాల, ఏప్రిల్24 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ విభాగంలో దారుణం చోటుచేసుకుంది. గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో ఏల్పుల బాలవ్వ(80) అనే వృద్ధురాలు మృతిచెందగా ఆమె చెవులకు ఉన్న ఆభరణాలు మాయమయ్యాయి. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన ఏల్పుల బాలవ్వ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని

ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం అర్ధరాత్రి చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బాలవ్వ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డు మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేసుకో వాలని బంధవులకు సూచించాడు. దీంతో బంధువులు బాలవ్వ మృతికి సంబంధించిన సర్టిఫికెట్లను ఆసుపత్రి సిబ్బంది నుంచి తీసు కొని మృతదేహాన్ని అంబులెన్స్‌లో వారి స్వ గ్రామానికి తరలించారు. ఇంటికి వెళ్లిన తర్వాత చూడగా బాలవ్వ చెవులకు ఉన్న కమ్మలు కనిపించక పోవడంతో వెంటనే ఆమె అల్లుడు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సెక్యూరిటీ గార్డును నిలదీశాడు. అతను తనకు సంబంధం లేదని చెప్పాడు. దీంతో బాలవ్వ అల్లుడు శంకర్ జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## వానాకాలంలో సాగు చేసే సన్న వరిరకాలపై సమీక్ష

**అందుబాటులో డిమాండ్ ఉన్న విత్తనాలు**

**ఎంఎస్‌పి భారాన్ని రాష్ట్రాలపై మోపొద్దు**

**ప్రకటించిన పంటలన్నింటిని కేంద్రమే కొనాలి**

**వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల డిమాండ్**

**హైదరాబాద్, ఏప్రిల్24 :** కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పి ప్రకటించి, పంటలను కొనే బాధ్యతను మాత్రం రాష్ట్రాలపై వేస్తుందని మంత్రి తుమ్మల అన్నారు. దీంతో రాష్ట్రంపై అధిక భారం పడుతుందని తెలిపారు. ఎంఎస్‌పి ప్రకటించిన ప్రతి పంటను కేంద్రమే కొనుగోలు చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. సచివాలయంలో వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ కొదండ రెడ్డి మరియు కమిషన్ సభ్యులతో సమావేశమైన మంత్రి తుమ్మల, వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం అందుబాటులో ఉంచాల్సిన వరి రకాల ఎంపిక, విత్తన లభ్యత, సాగు ప్రణాళికలపై వ్యవసాయశాఖ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు వచ్చే ఖరీఫ్ సీజన్ కోసం వివిధ రకాలను సిద్ధం చేసినట్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత సంవత్సరం 33 రకాల సన్న రకాలను అందుబాటులో ఉంచడం వలన రైతులు అమ్మకాల సందర్భంలో ఇబ్బందులు ఎదుర్కొన్నట్టు, కొన్నింటికి బోనస్ కూడా రాకుండా ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు.

# ఆమ్ ఆద్మీకి రాజీనామా

**మొదటిపేజీ తరువాయి..** నాయకత్వంలో దేశాభివృద్ధి కోసం పనిచేయాలని నిశ్చయించుకున్నట్లు రాఘవ్ వెల్లడించారు. రాజ్యాంగం మరియు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. ఒక సభలో ఉన్న పార్టీ సభ్యులలో మూడింట రెండు వంతుల మంది వేరే పార్టీలో చేరితే వారి సభ్యత్వానికి ఎటువంటి ముప్పు ఉండదు. ఈ సాంకేతిక వెసులుబాటుతోనే ఈ ముగ్గురు ఎంపీలు తమ సభ్యత్వాన్ని కాపాడుకుంటూ బీజేపీలో విలీనం కాబోతున్నారు. రాఘవ్ చద్దాతో పాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్ వంటి మరికొందరు ప్రముఖులు కూడా త్వరలోనే పార్టీని వీడతారని ఆయన పేర్కొనడం ఆప్ శ్రేణుల్లో గుబులు రేపుతోంది. కాగా, బీజేపీలో చేరబోతున్న రాఘవ్ చద్దాకు కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు దక్కే అవకాశం ఉన్నట్లు దేశ రాజధానిలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు అవినీతికి వ్యతిరేకంగా పుట్టిన పార్టీ, ఇప్పుడు తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## మహిళా బిల్లుపై అసెంబ్లీలో చర్చ

**వ్యతిరేకించిన పార్టీల తీరును ఎండగతాం**

**ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు టెలి కాన్ఫరెన్స్**

**అమరావతి, ఏప్రిల్24 :** చట్టసభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుపై ఇండియా కూటమి వైఖరిని ప్రజలకు ముఖ్యంగా మహిళలకు వివరించాలని ఎన్డీయే కూటమిలోని పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శు క్రవారం అమరావతిలో ఎన్డీయే నేతలు, ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీతోపాటు ఇతర భాగస్వామ్య పక్షాల వైఖరిని ప్రజలకు వివరించాలని సీఎం చంద్రబాబును పీవీఎన్ మాధవ్ కోరారు. అందుకు సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రాబోయే 10 రోజుల్లో ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశాల వేదికగా 'ఈ అంశం' పై చర్చిద్దామన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ మినహా అన్ని పక్షాలు సమర్థించాయని ఆయన గుర్తు చేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లును మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తుందని వివరించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మోదీ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఊాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒక కమిటీని నియమించినట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన పార్టీ నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కమిటీలో ఉంటారని పేర్కొన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ.. ఇప్పటికే నిడదవోలులో నిరసన ర్యాలీ నిర్వహించిన విషయాన్ని పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే.. తన అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రెస్ మీట్ పెట్టి ఈ అంశాన్ని వివరించాలని నేతలకు సూచించారు. అదే విధంగా త్వరలో ఆ అంశాన్ని ప్రజలకు వివరించేందుకు మూడు ప్రాంతాలు.. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలో బహిరంగ సభలు ఏర్పాటు చేయాలని ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కూటమి నేతలు నిర్ణయించారు.

## వందేమాతరం సామూహిక గీతాలపన

**మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా**

**మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్24 :** గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శు క్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

## కేదార్‌నాథ్‌కు భారీగా తరలివస్తున్న భక్తులు

**డెహ్రాడూన్, ఏప్రిల్24 :** చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

## రఘునాథపల్లి స్టేషన్ వద్ద పల్లా ధర్నా

**జనగామ, ఏప్రిల్24 :** వరంగల్ జిల్లాలోని నర్సంపేటకు వెళుతున్న మాజీ హోంమంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎంపీలు వినోద్ కుమార్, మాలోతు కవితను జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ గేట్ వద్ద పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. నర్సంపేట డిపో ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడంతో విషయం తెలుసుకున్న వారు నర్సంపేటకు వెళుతున్న క్రమంలో రఘునాథపల్లి పోలీసులు వారిని అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి వెంటనే రఘునాథపల్లి పోలీస్ స్టేషన్‌కు కార్యకర్తలతో చేరుకొని, స్టేషన్ ఎదురుగా బైఠాయించారు. బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం

## డ్రైవర్ శంకర్ గౌడ్ మృతికి దిగ్భ్రాంతి

**ఆత్మహత్యలు సరికావన్న పద్మాదేవేందర్**

**మెదక్, ఏప్రిల్24 :** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొంటూ, మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ దుర్ఘటన వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన హక్కుల కోసం వారు చేస్తున్న పోరాటం సమంజసమని, అయితే ఆ పోరాటంలో ప్రాణాలను కోల్పోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఎంత పెద్దవైనా వాటికి పరిష్కారం ప్రాణాలు తీసుకోవడం కాదని, ధైర్యంగా నిలబడి పోరాడితేనే న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుందన్నారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

## మునగాల కొండపై పెద్దపులి

**గుర్తించిన అటవీ అధికారులు**

**కాకినాడ, ఏప్రిల్24 :** తూర్పు గోదావరి జిల్లాలోని మునగాల కొండపై పెద్దపులి సంచరిస్తోంది. పెద్దపులి గురువారం రాత్రి శ్రీరంగపట్నం చెరువులో ఈదుకుంటూ మునగాల కొండపైకి చేరింది. మునగాల కొండపై పెద్దపులి సంచారంపై జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. పెద్దపులి కదలికలను మూడు టీంలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. విశాఖపట్నం నుంచి వచ్చిన ఒక టీం, రాజమండ్రిలో ఉన్న ఒక టీం, మత్తు డాక్టర్ల టీం ఆధ్వర్యంలో పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'థర్మల్ డ్రోన్ ద్వారా చీకట్లో కూడా పులి కదలికలను తెలుసుకుంటున్నాము. రెండు రోజుల క్రితం కాపవరం పాండవుల కొండ దగ్గరికి వచ్చిన మార్గంలోనే పులి ప్రయాణం కొనసాగిస్తోంది. పెద్దపులి మొదటిసారి జిల్లాలోకి వచ్చినప్పుడు ప్రజలను కంట్రోల్ చేయడానికి కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం పులి కొండపై ఉండటంవల్ల ఇబ్బంది లేదు'.. పెద్దపులి పశువులపైనే దాడి చేస్తోంది. మనుషులకు హాని చేయటం లేదు. పెద్దపులి నాలుగు రోజులకు ఒకసారి జంతువులను వేటాడి తింటుంది. పెద్దపులి ప్రస్తుతం ఆకలితో ఉంది. దానికి ఆహారంగా కొన్ని పశువులను సిద్ధంగా పెట్టాం. పులిని బంధించేందుకు రెండు బోన్లను కూడా సిద్ధంగా ఉంచాం' అని తెలిపారు.

## శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం

**భద్రతా ప్రమాణాలపై ఎన్‌జిఆర్ఐ నివేదిక**

**కాళేశ్వరంలోనూ భాగస్వామ్యం కావాలన్న ఉత్తమ్**

**హైదరాబాద్, ఏప్రిల్24 :** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగ మార్గం తవ్వకాలలో అనుకరించాల్సిన భద్రతా ఏర్పాట్లపై నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సమగ్రంగా రూపొందించిన నివేదికను శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎన్.జి.ఆర్.ఐ ప్రధాన శాస్త్ర వేత్త సత్యనారాయణ అందించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎన్.జి.ఆర్.ఐ సంస్థను అభినందించడంతో పాటు ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతితో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో బాగమైన మెడిగడ్డ, అన్నారం,సుందిళ్ల బ్యారేజ్ ల పునరుద్ధరణకు గాను ఎన్.జి.ఆర్.ఐ ఆధ్వర్యంలో భూపరిశోధన( సాయిలు టెస్ట్) భాగస్వామ్యం కావాలన్నారు. శుక్రవారం రోజు డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఈ మేరకు సమీక్షా సమావేశం నిర్వహించారు.ఇ ఎన్ సి రమేష్ బాబు సొరంగ మార్గం తవ్వకాల నిపుణుడు పరిక్షిత్ మెహ్రా,ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సందర్భంగాఎన్.జి.ఆర్.ఐ రూపొందించిన నివేదిక పై అయన మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం తవ్వకాల సమయంలో జరిగిన దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా ఉండేందుకే తవ్వకాల సమయంలో అనుసరించాల్సిన భద్రతా ప్రమాణాలపై ఎన్.జి.ఆర్.ఐ తో సమగ్రంగా సర్వే నిర్వహినట్లు ఆయన తెలిపారు.

వ్వకాల సమయంలో ముందస్తుగా ప్రమాదవకాశాలను గుర్తించేందుకు వీలుగా ఈ సంస్థ సీస్మిక్ ఇమేజింగ్,ఎలక్ట్రికల్ రెసిస్టివిటి టొమోగ్రఫీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించినట్లు ఆయన వివరించారు. సొరంగ మార్గం తవ్వకాలలో కార్మికుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం మొదట ప్రాధాన్యతాంశంగా పెట్టుకుందన్నారు. అందుకు తగినట్లు గానే ఎన్.జి.ఆర్.ఐ శాస్త్రవేత్తల మార్గదర్శనానికి అనుగుణంగానే సొరంగ మార్గం తవ్వకాలు ఉంటాయని

# అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేరు

- అక్షయ్ రాథోడ్ అరెస్టుపై బీజేపీ ఇల్లందు మండల కమిటీ నిప్పులు
- అక్షయ్ రాథోడ్ అరెస్ట్ అప్రజాస్వామికం: భట్టు రమేష్ ఆగ్రహం..

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజా చైతన్యాన్ని రగిలిస్తూ, అధికార పార్టీ అక్రమాలను ఎండగడుతున్న సోషల్ మీడియా వారియర్ అక్షయ్ రాథోడ్ అక్రమ అరెస్టును ఇల్లందు బీజేపీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు భట్టు రమేష్ మాట్లాడుతూ.. కేవలం ప్రశ్న అడిగినందుకో లేదా అక్రమాలను బయటపెట్టినందుకో అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఉంటున్న వ్యక్తిని పథకం ప్రకారం అరెస్టు చేయడం వెనుక ఉన్న రాజకీయ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. అక్షయ్ రాథోడ్ తన వాట్సాప్ ఛానల్ ద్వారా మండలంలోని అవినీతి కాంట్రాక్టర్ల గుట్టు రట్టు చేయడమే కాకుండా, భూ కబ్జాలకు వ్యతిరేకంగా సామాన్యుడి పక్షాన నిలబడ్డారని బీజేపీ నేతలు గుర్తు చేశారు. ముఖ్యంగా జగ్గుతండా పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జాదారుల బారి నుండి కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించారని, ఇది సహించలేని కొందరు అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా ఈ అక్రమ అరెస్టుకు పాల్పడ్డారని వారు ఆరోపించారు.



కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల కోసం లక్షలాది రూపాయల విరాళాలు సేకరించి ప్రాణదాతగా నిలిచిన వ్యక్తిని నేరస్తుడిగా చిత్రించడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న అక్షయ్ రాథోడ్ తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేయడం, పోలీసులను అడ్డుపెట్టుకుని వేధించడం వంటి చర్యలు నియంతృత్వ పోకడలకు నిదర్శనమని భట్టు రమేష్ విమర్శించారు. బీజేపీ కార్యకర్తగా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న అక్షయ్ ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు అండగా నిలబడటం, అధికారులకు సమాచారం అందించి చట్టపరమైన చర్యలు కోరడం నేరమా అని వారు ప్రశ్నించారు. అక్షయ్ రాథోడ్ పై మోపిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఇల్లందు మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీజేపీ స్పష్టం చేసింది. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తే పోరాటాలు మరింత ఉధృతమవుతాయని, అక్షయ్ కి పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా భట్టు రమేష్, మండల బీజేపీ శ్రేణులు ప్రకటించాయి.

# రెండో రోజు ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం

- బోధన్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపిన (టీయూసీఐ) ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నాయకులు.
- ప్రభుత్వాలు మారిన తీరని ఆర్టీసీ కార్మికుల కష్టాలు
- అధికారంలో ఉన్న పదేండ్లు పట్టించుకోని బీఆర్ఎస్ పార్టీ
- అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా న్యాయం చేయాలని సోయలేని కాంగ్రెస్ పార్టీ.
- బి. మల్లేష్, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి.





బోధన్:ఏప్రిల్ 24 జన సంఘర్షణ

శుక్రవారం బోధన్ పట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు టియుసిఐ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వానికి ఆ చిత్తశుద్ధి లేనట్లు కనపడుతుందని అందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ లాంటివారు సమ్మెపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నదని, సిబ్బందిని అడ్డుకుంటే పీడీ కింద కేసులు పెడతామని కార్మికులను భయభ్రాంతులకు చేసే ప్రకటనలను చేస్తున్నారని సమ్మెను విచ్చిన్నం చేసే కుట్రలు కోరుకుంటున్నారని ఇలాంటి కుట్రలను మానుకొని కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి పరిష్కరించాలని బి. మల్లేష్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన మల్లేష్‌తో పాటు టియుసిఐ బోధన్ డివిజన్ నాయకులు ఎండి ఇర్షాద్, పి.శంకర్, బి.సాయిలు, టీ.లాలు, జి. దేవయ్య, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల పోరుకు ఏఐఎఫ్‌బి మద్దతు

- వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే - బుడగం నాగేశ్వరరావు ధ్వజం

కొత్తగూడెం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)





తెలంగాణ రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమ్మెకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమనేత, ఏఐఎఫ్బీ భద్రాద్రి జిల్లా కన్వీనర్ బుడగం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజలకు రవాణా సేవలు అందిస్తున్న కార్మికులకు కనీస భద్రత లేకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఆర్టీసీ డ్రైవర్ మరణం వ్యవస్థలోని వైఫల్యాలకు అద్దం పడుతోందని, ప్రభుత్వ మొండివైఖరి వల్ల కార్మికులు ప్రాణాలు కోల్పోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని ఆయన విమర్శించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలు, పెరగని వేతనాలు, పని ఒత్తిడితో సతమతమవుతున్న డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన సవరణ చేయకుండా, కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ విధానాలతో ఉద్యోగ భద్రతను కాలరాయడం అన్యాయమని నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రిటైర్మెంట్ తర్వాత పెన్షన్, వైద్య సేవలు అందక వృద్ధాప్యంలో కార్మికులు రోడ్డున పడుతున్నారని, సంస్థపై ఉన్న అప్పుల భారాన్ని సామాన్య ఉద్యోగులపై మోపడం ప్రభుత్వ అసమర్థతేనని దుయ్యబట్టారు. ప్రైవేట్ రూట్లను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ రంగ సంస్థను నీరుగార్చడం వల్ల భవిష్యత్తులో ప్రజా రవాణా వ్యవస్థ సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే మొండిపట్టు వీడి, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం, పెండింగ్ జీతాల విడుదల మరియు ప్రైవేటీకరణ నిలిపివేతపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఏఐఎఫ్బీ కార్మికుల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# భద్రాద్రి జిల్లాలో నూతన న్యాయమూర్తుల నియామకం!

- భద్రాద్రి న్యాయక్షేత్రంలో మార్పులు కొత్తగూడెం, ఇల్లందు జడ్జిల బదిలీ..

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)




రాష్ట్ర న్యాయశాఖలో భారీ కసరత్తు జరిగింది. పరిపాలనాపరమైన మార్పుల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 49 మంది జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గౌరవ హైకోర్టు సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కీలక స్థానాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం జడ్జిగా సేవలందించిన ఎ. సుచరిత మెదక్ జిల్లా అల్లాదుర్గాకు బదిలీ కాగా, ఇల్లందులో న్యాయాధికారిగా ఉన్న డి. కీర్తి చంద్రికా రెడ్డి రాజధాని నగరం ఎల్బీనగర్ కు వెళ్లనున్నారు. వీరి స్థానంలో కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్.వి. హైమ పూజిత, ఇల్లందు న్యాయమూర్తిగా కుమారి స్వరూప కాటం బాధ్యతలు చేపట్టనున్నారు. న్యాయవ్యవస్థలో ఈ బదిలీలు సహజమైన ప్రక్రియే అయినప్పటికీ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో నూతనంగా నియమితులైన న్యాయమూర్తుల పాత్ర అత్యంత కీలకం కానుంది. కేవలం సీట్ల మార్పు మాత్రమే కాకుండా, సామాన్యుడికి న్యాయస్థానాలపై ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచే దిశగా ఈ కొత్త నియామకాలు బాధ్యతాయుతమైన సేవలు అందిస్తాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

# విజయలక్ష్మి నగర్‌లో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం!

- గ్రామ స్వరాజ్యమే లక్ష్యం




ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

"గ్రామాలే దేశానికి వెన్నెముక" అన్న గాంధీజీ కలలను సాకారం చేసే దిశగా, విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు అత్యంత అర్థవంతంగా జరిగాయి. సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ ప్రత్యేక గ్రామసభలో, స్థానిక స్వపరిపాలన యొక్క ఆవశ్యకతను, పంచాయతీరాజ్ చట్టం కల్పిస్తున్న అధికారాల ప్రాముఖ్యతను లోతుగా చర్చించారు. కేవలం అభివృద్ధి పనులకే పరిమితం కాకుండా, ప్రతి పౌరుడు గ్రామ పరిపాలనలో భాగస్వామి అయినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, గ్రామాభివృద్ధికి పునరంకితం కావాలని సంకల్పించారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారానే గ్రామాల రూపురేఖలు మారుతాయని ఈ సభ మరోసారి చాటిచెప్పింది.

# ఆర్టీసీ పోరుకు పెరిగిన ప్రజా మద్దతు

- ఇల్లందు డిపో వద్ద కదం తొక్కిన టీయుసిఐ, పిడిఎస్‌యు, అరుణోదయ శ్రేణులు!

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)




న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరడంతో పోరాటం మరింత ఉధృతమైంది. ఈ నేపథ్యంలో, ఇల్లందు బస్ డిపో ముందు కొనసాగుతున్న కార్మికుల శిబిరానికి ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించి, కార్మికుల పోరాటాన్ని కీర్తిస్తూ సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా టీయుసిఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కంపాటి పృథ్వి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలకు సేవలందించే ఆర్టీసీ కార్మికులను రోడ్డున పడేయడం ప్రభుత్వానికి తగదని హెచ్చరించారు. కేవలం డ్రైవర్లు, కండక్టర్లే కాకుండా అటు హమాలీలు, ఇటు టాటా మ్యాజిక్ డ్రైవర్లు సైతం తరలివచ్చి కార్మికుల గొంతులో గొంతు కలపడం ఈ ఉద్యమ తీవ్రతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు. వ్యవస్థను నమ్ముకున్న శ్రామికుడికి అన్యాయం జరిగినప్పుడు సమాజం మౌనంగా ఉండదని, ఈ ఏకధాటి పోరాటం ప్రభుత్వ మెడలు వంచడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లెల వెంకటేశ్వర్లు, కునూరీ వీరన్న, బుర్ర రాఘవులు సహా పలువురు కీలక నాయకులు పాల్గొని తమ గళాన్ని వినిపించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బోధన్: ఏప్రిల్ 24 జన సంఘర్షణ



తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు శాసనసభ్యులు పొద్దుటూరి. సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ లబ్ధిదారులకు చెక్కులను బోధన్ మండలంలోని ఊట్ పల్లి గ్రామంలో గ్రామ ఉప సర్పంచ్ నరేందర్ గౌడ్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చాలా మేలైన పథకం అని అన్నారు. లబ్ధిదారులకు చేరేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేశారు. బోధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ డివి ప్రభాకర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సాక్షిగా.. అపూర్వ కలయిక!

- మేడారం వేదికగా ఇల్లందు మాజీ మున్సిపల్ పాలకవర్గ ఆత్మీయ సమ్మేళనం

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)






పదవులు శాశ్వతం కావు.. కానీ ఆ పదవుల్లో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, పంచిన ప్రేమాభిమానాలు ఎప్పటికీ చెరిగిపోవని ఇల్లందు మాజీ మున్సిపల్ పాలకవర్గం (2014-2019) నిరూపించింది. నాడు ఇల్లందు మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపిన సారథులంతా, శుక్రవారం మేడారం సమ్మక్క-సారక్క సన్నిధిలో కొలువుదీరారు. నాటి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ 'గెట్ టుగెదర్' కేవలం ఒక విందు వినోదంగా కాకుండా, ఐదేళ్ల పాలనలో ప్రజల కోసం చేసిన కృషిని, ఎదుర్కొన్న సవాళ్లను సింహావలోకనం చేసుకున్న ఒక అర్థవంతమైన వేదికగా నిలిచింది. ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య మరియు నాటి మున్సిపల్ చైర్మన్ మడత రమ వెంకట్ గౌడ్ నాయకత్వంలో ఇల్లందు రూపురేఖలు మార్చిన తీరును సభ్యులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. దాదాపు రూ. 120 కోట్ల భారీ నిధులతో నిర్మించిన రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఇంటింటికీ తాగునీరు వంటి మౌలిక వసతులు నేటికీ ప్రజలకు సేవలు అందిస్తుండటం ఆనాటి పాలకవర్గం యొక్క దూరదృష్టికి నిదర్శనం. రాజకీయాలకు అతీతంగా, పట్టణ ప్రయోజనమే పరమావధిగా సాగిన ఆ సమిష్టి కృషి నేటి తరానికి ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మీయ వేడుకలో భాగంగా 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ సహా అప్పటి కౌన్సిలర్లందరినీ ఘనంగా సన్మానించారు. మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, శంకర్ పల్లి కమిషనర్ అంజన్ కుమార్, ఇతర ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో.. పాత జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, భవిష్యత్తులోనూ ఇదే స్నేహాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. పదవుల్లో లేకపోయినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేయాలంటే అంకితభావంతో కూడిన పనే ఆయుధమని ఈ సమ్మేళనం చాటిచెప్పింది.

జన సంఘర్షణ
తెలుగు దినపత్రిక
శనివారం 25 ఏప్రిల్ 2026

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థల పరిశీలన

- **జిల్లా కలెక్టర్**
- **శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం**

బోధన్: ఏప్రిల్ 24 జన సంఘర్షణ

అన్ని హంగులతో ప్రభుత్వం నూతనంగా నిర్మించదల్చిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహ సముదాయం కోసం బోధన్ పట్టణ శివారులోని బెల్లాల్ ప్రాంతంలో ఎంపిక చేసిన స్థలాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్ళ నిర్మాణానికి ఈ స్థలాన్ని ఖరారు చేసినందున, శంకుస్థాపన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే పనులు ప్రారంభించి, నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన వసతి, సదుపాయాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులందరికీ ఒకే సముదాయంలో అన్ని అధునాతన సౌకర్యాలతో వసతిని కల్పిస్తూ, ఉన్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో అందరికీ ఆదర్శంగా నిలిచేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే





మంజూరీ తెలుపబడిన బోధన్ నియోజక వర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీ.ఈ రాందాస్, తహసీల్దార్ విఠల్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# తాగునీటి సరఫరా వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమీక్ష సమావేశం

బోధన్: ఏప్రిల్ 24 జన సంఘర్షణ

నిజామాబాద్ జిల్లా కలెక్టర్ బోధన్ సబ్-కలెక్టర్ తో కలిసి, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లో తాగునీటి సరఫరా పరిస్థితి మరియు వేసవి కార్యాచరణ ప్రణాళికపై సమగ్ర సమీక్ష సమావేశం శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించి, క్రింది సూచనలు జారీ చేశారు. డేటా సమీక్ష. ప్రతి గ్రామంలో జనాభా, గృహాల సంఖ్య, ట్యాప్ కనెక్షన్ల వివరాలను నవీకరించి, సమర్థవంతమైన ప్రణాళిక కోసం సంరక్షించాలి. ఓహెచ్ఎస్ఆర్ నిర్వహణ అన్ని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లను క్రమం తప్పకుండా పరిశీలించి, చిన్నపాటి మరమ్మత్తులను గ్రామ పంచాయతీ మరియు మండల నిధులతో వెంటనే చేపట్టాలి. ఆర్డబ్ల్యూఎస్ గ్యాప్ ఫండింగ్ గ్రామీణ తాగునీటి సరఫరాలో ఉన్న లోపాలను జీపీ, మండల నిధులతో భర్తీ చేసి, నిరంతర సరఫరా కొనసాగించాలి. హ్యాండ్ పంపులు, మోటార్లు హ్యాండ్ పంపుల ఫ్లషింగ్, మోటార్ల మరమ్మత్తులను ప్రాధాన్యతగా తీసుకుని, అన్ని నీటి వనరులు పనిచేసేలా చూడాలి. నీటి సరఫరా నిర్వహణ నీటి సరఫరాలో అంతరాయాలు కలిగిన వెంటనే స్పందించి, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. నీటి ట్యాంకుల శుభ్రత నీటి నిల్వ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచడం, క్లోరినేషన్ చేయడం ద్వారా నీటి నాణ్యతను కాపాడాలి. ఇసుక అనుమతులు ఇసుక తవ్వకం, రవాణా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో మాత్రమే అనుమతించాలి. టిప్పర్ వినియోగం: టిప్పర్లను కేవలం బ్లాక్ సాయిల్ రవాణాకు మాత్రమే అనుమతించాలి. ఇతర వినియోగాన్ని కఠినంగా నిరోధించాలి. వేసవి కార్యాచరణ ప్రణాళిక: సమగ్ర వేసవి ప్రణాళికను అమలు చేసి, అవసరమైతే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా, సమస్యాత్మక గ్రామాల పర్యవేక్షణ వంటి



చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశానికి ఎసీ,ఆర్డబ్ల్, సిఈఓ, జెడ్ పి ,డిపిఓ,డిఎల్ పీఓ, ఎంపిడిఓలు, రెండు నియోజకవర్గాల వాటర్ సప్లై ఇంజినీర్లు హాజరయ్యారు.

# భద్రాద్రిలో వైభవంగా 'పోషణ పక్వాడ' ముగింపు ఉత్సవాలు

- **ఆరోగ్య భారతే లక్ష్యం: భద్రాద్రిలో ఘనంగా పోషణ పక్వాడ ముగింపు - అక్షరభ్యాసాలు, శ్రీమంతాలతో సందడి!**

కొత్తగూడెం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వేదికగా జిల్లా స్థాయి 'పోషణ పక్వాడ' ముగింపు వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, సమాజంలోని తల్లీబిడ్డల ఆరోగ్యం, పౌష్టికాహార ప్రాముఖ్యతను చాటిచెప్పే ఒక సామాజిక ఉద్యమంగా ఈ ఉత్సవం నిర్వహించబడింది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అంగన్వాడీల పాత్రను గుర్తు చేస్తూ, ఈ కార్యక్రమం అందరినీ ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించడం విశేషం. బుడిబుడి అడుగుల స్థాయి నుంచి అక్షరజ్ఞానం పొందిన చిన్నారులకు అక్షరభ్యాసం చేయించడంతో పాటు, గర్భిణీ స్త్రీలకు సంప్రదాయబద్ధంగా శ్రీమంతాలు నిర్వహించారు. మాతృత్వంపై గౌరవాన్ని, బాల్యంపై మమకారాన్ని చాటుతూ జరిగిన ఈ వేడుకలు కలెక్టరేట్ హాల్‌లో ఒక పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి. పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా క్షేత్రస్థాయిలో విశేష కృషి చేసిన వారిని ఈ వేదికపై ఘనంగా సన్మానించారు. అత్యున్నత ప్రతిభ కనబరిచిన సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ



అభియాన్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లకు అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. విధి నిర్వహణలో నిబద్ధత చూపే వారికి ఇచ్చే ఈ గుర్తింపు, తోటి సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజం ఆర్థికంగా ఎంత ఎదిగినా,



పౌష్టికాహార లోపం లేని తరం ఉన్నప్పుడే ఆ అభివృద్ధికి సార్థకత లభిస్తుందని గుర్తు చేశారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి పెట్టడం అంటే అది ఒక కుటుంబానికి కాదు, దేశ భవిష్యత్తుకు పునాది వేయడమేనని ఆమె వ్యాఖ్యానించారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఒక సామాజిక యోధుడిలా పనిచేసి జిల్లాను 'పోషణ లోపం లేని జిల్లా'గా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

# అంగన్వాడీ టీచర్లకు టిఎన్జీవో సభ్యత్వం

ముధోల్, ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)



ముధోల్ శిశు మహిళా సంక్షేమ ప్రాజెక్ట్ (ఐసిడిఎస్) పరిధిలో జిల్లా, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు సభ్యత్వ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సంపూర్ణ, నేదూరి విజయ నిర్మల, వంగ వరలక్ష్మి (టిఎన్జీవో) నాయకత్వంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్, ఆయా యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే సి.ఐ.టి.యూ సభ్యులు సుజాత, రేష్మ, ఫారానా, జయలక్ష్మి, కే. ముత్తమ్మ, వి. ముత్తమ్మ, విమల, చందురాణి, ప్రభా, నర్సుభాయ్, శోభ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముధోల్ ప్రాజెక్ట్ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 50 మంది అంగన్వాడీ టీచర్లు టిఎన్జీవోలో సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ

బోధన్: ఏప్రిల్ 24 జనసంఘర్షణ



బోధన్ మండలంలోని భవాని పేట్ గ్రామంలో బోధన్ శాసనసభ్యులు ప్రభుత్వ సలహాదారులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ భవనానికి 20 లక్షల రూపాయలు, అంగన్వాడి భవనానికి 12 లక్షల రూపాయలు, వ్యవసాయ డొంకలకు మట్టికి 11 లక్షల రూపాయలు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగ శంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, బోధన్ మండల అధ్యక్షులు నాగేశ్వరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ లిఖిత, గ్రామ సర్పంచ్ నాగేంద్ర వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు తోట గంగాధర్, బోధన్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గంగోని యజ్ఞేశ్, మాజీ ఎంపీటీసీ పోశెట్టి, కొడాలి గోపి, సుబ్బారావు, గ్రామ వార్డు సభ్యులు లింగారం, మల్లాపురం లక్ష్మయ్య. తదితరులు పాల్గొన్నారు.

# సొంతనిధులతో బోరు బావి తవ్వించిన 8వ వార్డు కౌన్సిలర్

ఎల్లారెడ్డి, ఏప్రిల్ -24(జన సంఘర్షణ )



ఎన్నికల హామీలను ఒకటొకటిగా నెరవేర్చుతూ ప్రజల మెప్పు పొందుతున్నారు 8వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ సిద్ధిసిధర్ గుప్తా. రెండు నెలల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సిద్ధి శ్రీధర్ గుప్తా ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం సొంత నిధులతో బోరుబావి తవ్వించారు. మున్సిపల్ ఎన్నికల్లో తన సొంత మ్యానిఫెస్టో ప్రకటించి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగారు. ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో సిద్ధి శ్రీధర్ గుప్తా భారీ మెజారిటీతో విజయం సాధించారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపి, బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులు గుప్త చేతిలో పరాజయం పాలయ్యారు. ఆడపిల్ల పెళ్లికి 11 వేల రూపాయలు ఇస్తానన్న హామీని నెరవేరుస్తూ.. వార్డుకు చెందిన ఇద్దరు ఆడకూతురుల వివాహానికి 22 వేల రూపాయలు అందించారు. అలాగే ఆడకూతురు పుడితే 10 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించిన నెరవేర్చారు. తన వార్డులోని ఉప్పర్ గల్లీలో నీటి ఎద్దడి తీర్చేందుకు సొంత నిధులతో బోరుబావి తవ్విస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. సంవత్సరాల తరబడి నీటి ఎదడి ఎదుర్కొంటున్న ఉప్పర గల్లి వాసులకు వేలాది రూపాయలు ఖర్చు చేసి బోరు బావి తవ్వించడంపై గల్లి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కొంతమందికే సాధ్యమని, అందులో సిద్ధి శ్రీధర్ గుప్తా వంటి వారు అరుదు అని పట్టణ ప్రజల పేర్కొంటున్నారు.

# వాసవీ జయంతిని అధికారికంగా ప్రకటించడంపై హర్షాతిరేకాలు

- **రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం: 'వాసవీ జయంతి' జీవోపై ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు**

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)



వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారిక పండుగగా గుర్తిస్తూ జీవో విడుదల చేయడం పట్ల ఆర్యవైశ్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం ఇల్లందులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో, సత్రం పునర్నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం కోట్లాది మంది వాసవి భక్తులకు దక్కిన గౌరవమని, ఇది ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని పెంచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లెర్ల చంద్రశేఖర్, కటకం బాలకృష్ణ, పసుమర్తి శ్రీనివాస్, బోనగిరి రవికిరణ్ సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్ మృతిపై వాసు ధనాల ఆవేదన

- **ఆగిపోయిన చక్రం - ఆరిపోయిన ప్రాణం: డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై బిఆర్ఎస్ నాయకులు వాసు ధనాల దిగ్భ్రాంతి**

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)



ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ అకాల మరణం అత్యంత బాధాకరమని, ఆయన మృతి యావత్ కార్మిక లోకాన్ని కలచివేసిందని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వాసు ధనాల (శ్రీనివాస బాబు) తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజా సేవలో చక్రం తిప్పే డ్రైవర్ ప్రాణం ఇలా అర్థాంతరంగా గాలిలో కలిసిపోవడం తీరని లోటని ఆయన పేర్కొన్నారు. ఏ సమస్యకైనా చావు పరిష్కారం కాదని, ప్రాణం కంటే మించిన డిమాండ్ మరేదీ లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.కుటుంబాలకు అండగా ఉండాల్సిన కార్మికులు అధైర్యంతో ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకోవద్దని వాసు ధనాల కోరారు. "తోటి కార్మికులారా.. ధైర్యం కోల్పోకండి, మీ వెనుక మేమున్నాం" అంటూ ఆయన భరోసా ఇచ్చారు. శంకర్ గౌడ్ మరణం ఒక వ్యక్తి మరణం కాదని, ఒక కుటుంబం రోడ్డున పడటమేనని, ఇలాంటి హృదయవిదారక ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని వాసు ధనాల డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారిలో నెలకొన్న ఆందోళనను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మృతి చెందిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని, తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మరో ప్రాణం పోకముందే మేల్కోవాలని ఆయన హెచ్చరించారు.

# ఇల్లందులో మున్సిపల్ సిబ్బందిపై తేనెటీగల దాడి

- **విధి నిర్వహణలో విపత్తు: ఇల్లందులో మున్సిపల్ సిబ్బందిపై తేనెటీగల దాడి - కాంట్రాక్టర్ కాలు ఫ్యాక్చర్**

ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)



ప్రజా పనుల కోసం ప్రాణాలకు తెగించి పనిచేసే కార్మికులకు ఒక్కోసారి ప్రకృతి కూడా పరీక్ష పెడుతుందని నిరూపిస్తూ, ఇల్లందు కోర్టు ఏరియాలో శనివారం ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. వాటర్ ట్యాంకు పైప్‌లైన్ మరమ్మతు పనుల్లో నిమగ్నమైన మున్సిపాలిటీ కాంట్రాక్టు సిబ్బందిపై ఊహించని విధంగా తేనెటీగలు ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. ఈ హఠాత్పరిణామంతో దిక్కుతోచని స్థితిలో ప్రాణాలు కాపాడుకోవడానికి పరుగులు తీసే క్రమంలో, కాంట్రాక్టర్ తీవ్రంగా కిందపడి కాలు ఫ్యాక్చర్ కాగా, పలువురు సిబ్బంది తేనెటీగల కాటుకు గురై గాయపడ్డారు. స్థానికుల అప్రమత్తతతో బాధితులను తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు హర్షవర్ధన్, ప్రత్యూష వారికి అత్యవసర చికిత్స అందించారు. అభివృద్ధి పనుల వేళ సిబ్బంది భద్రతపై ముందస్తు జాగ్రత్తలు ఎంత అవసరమో ఈ ఘటన మరోసారి ఆలోచింపజేస్తోంది.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక


## గిరిజన యువతకు గ్లోబల్ ఆఫర్ - ఐటీడీఏ భద్రాచలం పిలుపు

◆ **ఖండంతరాల కొలువు - లక్షల్లో జీతం: నిరుద్యోగులకు ఐటీడీఏ భద్రాచలం సువర్ణావకాశం!**



భద్రాచలం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

మారుమూల ప్రాంతాల యువత కలలు కన్నట్టుగానే, విదేశీ గడ్డపై తమ నైపుణ్యాన్ని చాటుకునేందుకు ఐటీడీఏ భద్రాచలం ఒక అద్భుతమైన వేదికను సిద్ధం చేసింది. కేవలం పట్టణాలకే పరిమితం అనుకునే విదేశీ ఉద్యోగ అవకాశాలను గిరిజన యువత దరికి చేరుస్తూ, ఆస్ట్రేలియా, జర్మనీ, ఒమన్ వంటి దేశాల్లో పెయింటర్, మెకానిక్, వెల్డర్ మరియు నర్సు పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఏడాదికి 24 లక్షల నుండి 48 లక్షల రూపాయల వరకు అత్యున్నత వేతనం పొందే ఈ అవకాశం, ఒక సామాన్యుడి కుటుంబ తలరాతనే మార్చేయగలదని పీఓ బి. రాహుల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు, నైపుణ్యమే పెట్టుబడిగా ప్రపంచ వేదికపై నిలబడాలనుకునే అర్హత గల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్, విద్యార్హత పత్రాలతో ఈ నెల 27, 28 తేదీల్లో భద్రాచలం ఐటీడీఏలోని 'భవిత సెల్'ను సంప్రదించాలి. ఇంటి వద్దే ఉండి అవకాశాల కోసం ఎదురుచూడటం కంటే, ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి మార్గాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడం నేటి యువతకు అత్యవసరం.

## ఇల్లందు డిపో సాక్షిగా ఉవ్వెత్తున ఎగిసిన కార్మిక గళం

◆ **సెగలు రేపుతున్న ఆర్టీసీ సమ్మె: ఇల్లందు డిపో ఎదుట వామపక్షాల ధర్నా**
◆ **శంకర్ గౌడ్ మృతిపై నిప్పులు చెరిగిన నేతలు**



ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

తెలంగాణ గడ్డపై మరోసారి కార్మిక పోరాట జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకున్న నేపథ్యంలో, ఇల్లందు డిపో కేంద్రంగా సీఐటీయూ, ఏఐటీయూసీ వంటి వామపక్ష కార్మిక సంఘాలు ఉమ్మడి గళాన్ని వినిపిస్తూ భారీ ధర్నా నిర్వహించాయి. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న ఉదాసీనతను ఎండగడుతూ, విధి నిర్వహణలో ఉంటూనే మానసిక ఒత్తిడితో తనువు చాలించిన నర్సంపేట కార్మికుడు శంకర్ గౌడ్ మృతికి ఈ సందర్భంగా కన్నీటి నివాళులర్పించారు. "చక్రం ఆగిపోతే ప్రాణం పోయే పరిస్థితి రావడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు" అని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటం మరింత ఉధృతమై శాసనసభను సైతం కుదిపేస్తుందని హెచ్చరించారు. కడుపు మండిన కార్మికుడు రోడ్డు మీదకు వస్తే అది ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతుందనే చేదు నిజాన్ని పాలకులు గుర్తించాలని ఈ ధర్నా వేదికగా ఆలోచింపజేసేలా పిలుపునిచ్చారు.

## నైపుణ్యమే ఆయుధంగా.. పాల్వంచలో కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన

◆ **ఉపాధి దిశగా అడుగులు - నైపుణ్య కేంద్రంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ: శిక్షణ నాణ్యతపై ఆరా!**



పాల్వంచ ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

కేవలం డిగ్రీలు మాత్రమే కాదు, చేతివృత్తుల్లో రాణించినప్పుడే ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందనే సత్యాన్ని చాటుతూ పాల్వంచలోని నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సందర్శించారు. అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను అత్యంత సమగ్రంగా పరిశీలించిన ఆయన, వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలు, పురుషులతో స్వయంగా ముచ్చటించి క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకున్నారు. శిక్షణ కాలవ్యవధి, అందుతున్న వసతులు, నాణ్యతపై ఆరా తీయడమే కాకుండా, శిక్షణ అనంతరం వారు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు ఎలా ఉన్నాయి, ఆశించిన స్థాయిలో ఆదాయం లభిస్తుందా అన్న కోణంలో లోతైన విశ్లేషణ చేశారు. కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయడం కాకుండా, అది ఒక వ్యక్తి గౌరవప్రదమైన జీవనానికి దారి చూపేలా ఉండాలని, అప్పుడే ఇలాంటి కేంద్రాల లక్ష్యం నెరవేరుతుందని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చూపిస్తున్న ఈ చొరవను నిరుద్యోగ యువత అందిపుచ్చుకొని, ఉపాధి పొందే యజమానులుగా కాకుండా ఉపాధిని ఇచ్చే స్థాయికి ఎదగాలన్నది ఈ పర్యటనలోని అంతరార్థం.

## ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన 'కాయకల్ప బృందం' సభ్యులు



ఎల్లారెడ్డి, ఏప్రిల్ 24(జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం కాయకల్ప బృందం సభ్యులు సందర్శించి పరిశీలించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని స్త్రీ, పురుష రోగుల విభాగాలతో పాటు కాన్పు, ఆపరేషన్, ఫార్మసీ, ఆరోగ్యశ్రీ విభాగాలను పరిశీలించా రన్నారు. అలాగే ఆస్పత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ ఏ క్యూ యు ఏ ఎస్ అసెస్మెంట్ అడ్వైజర్ డాక్టర్ యాదయ్య, డాక్టర్ శివనాథ్ సద్నేష్ సీనియర్ కన్సల్టెంట్ ఎన్ క్యూ ఏ ఎస్ అడ్వైజర్, నర్సింగ్ ఆఫీసర్ మౌనిక ప్రియదర్శిని, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ దిలీప్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తగూడెం అన్నదాతలకు తీపి కబురు - రికార్డు స్థాయిలో కొనుగోలు కేంద్రాలు

◆ **రైతు ముంగిటకే 'మద్దతు ధర': కొత్తగూడెం నియోజకవర్గానికి 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు**
◆ **ఎమ్మెల్యే కూనంనేని మార్క్ రాజకీయం!**



కొత్తగూడెం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

కొత్తగూడెం నియోజకవర్గ వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చే విధంగా, అన్నదాతల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రభుత్వం ఏకంగా 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంజూరు చేసింది. గత పాలనతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికంగా కేంద్రాలను కేటాయించడం వెనుక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన నిరంతర కృషి స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రికార్డు స్థాయిలో కేంద్రాలను సాధించుకోవడం ద్వారా నియోజకవర్గంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక బలమైన ముందడుగు పడింది. ప్రతి మండలానికి సగటున ఐదు నుండి ఆరు కేంద్రాలు అందుబాటులోకి రానుండటంతో, ఇకపై రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవడానికి కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. రవాణా భారం తగ్గడమే కాకుండా, ధాన్యం నిల్వ చేసే క్రమంలో ఎదురయ్యే ప్రకృతి వైపరీత్యాల భయం నుంచి కూడా రైతులకు విముక్తి లభించనుంది. పొలం గట్టు దగ్గరే విక్రయాలు జరిగేలా వ్యవస్థను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడం అన్నదాతలకు పెద్ద ఊరటనిచ్చే అంశం. ఈ సరికొత్త వ్యవస్థ ద్వారా దళారుల దోపిడీకి చెక్ పడనుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, రైతులు నేరుగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను తమ ఖాతాల్లోకి పొందే అవకాశం కలిగింది. "రైతే రాజు" అనే నినాదం కాగితాల మీద కాకుండా, వారి ఆర్థిక పురోగతిలో కనిపించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కూనంనేని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మంజూరైన కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసి, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు ప్రారంభించాలని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్లు మాత్రమే కాదు.. చెమటోడ్చి పనిచేసే రైతన్న కళ్లలో ఆనందం చూడటమే నిజమైన అభివృద్ధి అని ఈ నిర్ణయం ఆలోచింపజేస్తోంది. వ్యవసాయాన్ని పండుగలా మార్చాలంటే ఇలాంటి పటిష్టమైన యంత్రాంగం అవసరమని, పాలకుల చిత్తశుద్ధి ఉంటే మారుమూల ప్రాంతాల రైతులకు కూడా న్యాయం జరుగుతుందని ఈ రికార్డు స్థాయి కేంద్రాల కేటాయింపు నిరూపిస్తోంది.

## ఘనంగా దత్తాత్రేయ ఆలయం ప్రారంభోత్సవం

కుబీర్, ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)



మండల్‌లోని బరమేశ్వర్ గ్రామంలో శ్రీ దత్తాత్రేయ ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇటువంటి ఆలయాలు కేంద్రబిందువులుగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముధోల్ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు శంకర్ చంద్రి , నిర్మల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బంక బాబు, జిల్లా సెక్రెటరీ పురం శెట్టి రవికుమార్, ఆత్మ చైర్మన్ ఎస్. వివేకానంద, జిల్లా సెక్రెటరీ జదవ్ దత్తరాం, కుబేర్ మండల్ జనరల్ సెక్రెటరీ పి. శివాజీ పాల్గొన్నారు. అలాగే బరమేశ్వర్ గ్రామ సర్పంచ్ అశోక్ రాథోడ్, మాజీ సర్పంచ్ దత్తరం, మాజీ ఎంపీటీసీ శ్యామ్ రావు, సిరిపెల్లి సర్పంచ్ క్రాంతి రాజ్, నారాపరచడం సాంగ్వి ఆనందరావు పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక సర్పంచ్‌లు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మక్కా కొనుగోలు కేంద్రానికి సబ్ సెంటర్ ఏర్పాటు

◆ **రైతుల హర్షం**



భైంసా, ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

భైంసా పట్టణంలో రైతులకు ఊరట కలిగించే చర్యగా, ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఇచ్చిన మాట ప్రకారం మక్కా కొనుగోలు కేంద్రానికి సబ్ సెంటర్ ఏర్పాటు చేయించారు. కమలాపూర్ గుట్ట పక్కన ఉన్న మినీ స్టేడియం ప్రాంగణంలో ఈ సబ్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సబ్ సెంటర్ ద్వారా రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తన్న, బీజేపీ టౌన్ అధ్యక్షులు రావుల రాము, సర్పంచ్ కుంట రాజలింగు, ఉప సర్పంచ్ దిపోల్ల సాయినాథ్, కౌన్సిలర్ నిమ్మల ప్రవీణ్, వడ్నప్ శ్రీనివాస్, అల్లెం దిలీప్, జె. రాహుల్, అమూల్, చర్ల సుభాష్, ఆత్మ డైరెక్టర్ మామిడి స్వామి, సిద్దూర్ సర్పంచ్ సుధాకర్, అల్లకొండ సతీష్, బోల్శెట్టి రాజు, బోల్శెట్టి రాజేశ్వర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ జేఏసీ గళం - నెరవేరని ఎన్నికల హామీలపై ధ్వజం

◆ **'మావి గొంతెమ్మ కోరికలు కావు.. మీరు ఇచ్చిన హామీలే': ప్రభుత్వానికి ఆర్టీసీ జేఏసీ సూటి ప్రశ్న!**

కొత్తగూడెం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సెగలు రేపుతున్న వేళ, జేఏసీ నాయకుడు బి.ఎన్. రావు ప్రభుత్వంపై సంధించిన విమర్శలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. కొత్తగూడెం సమ్మె శిబిరం సాక్షిగా ఆయన మాట్లాడుతూ.. తాము అడుగుతున్నది ఆకాశంలో చందమామను కాదని, ఎన్నికల సమయంలో పాలకులే స్వయంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలనే అమలు చేయాలని కోరుతున్నామని కుండబద్దలు కొట్టారు. 41 రోజుల సుదీర్ఘ గడువుతో ముందస్తు నోటీసు ఇచ్చినా, కనీసం




చర్చలకు పిలవని ప్రభుత్వ మొండి వైఖరి వల్లే నేడు నిరవధిక సమ్మె అనే కఠిన నిర్ణయానికి కార్మికులు రావలసి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న 32 న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించకపోవడం ప్రభుత్వ నైతిక వైఫల్యమేనని ఎండగట్టారు. ప్రజా రవాణా వ్యవస్థను నమ్ముకున్న కార్మికుల ఆకలి కేకలను 'గొంతెమ్మ కోరికలు'గా చిత్రించడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని, ఇప్పటికైనా పాలకులు పంతాలకు పోకుండా మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చూపాలని సీనియర్ రిపోర్టర్ స్థాయి విశ్లేషణతో ఆయన గళం వినిపించారు.

## కొత్తగూడెం కోటలో ఎగిసిన గులాబీ జెండా – ఆర్టీసీకి వనమా అండ

◆ **ప్రజా క్షేత్రంలో వనమా విశ్వరూపం: కొత్తగూడెం డిపో సాక్షిగా ప్రభుత్వంపై సమరశంఖం -'శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యే'**

కొత్తగూడెం ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)

తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల సమ్మె అగ్గి రాజేస్తోంది. కార్మికుల న్యాయబద్ధమైన పోరాటానికి మద్దతుగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తగూడెం నియోజకవర్గం శనివారం ప్రజా పోరాట క్షేత్రంగా మారింది. స్థానిక ఆర్టీసీ డిపో గేటు ముందు వందలాది మంది కార్మికులు, బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి




ఆయన నిర్వహించిన భారీ ఆందోళన రాష్ట్రవ్యాప్త దృష్టిని ఆకర్షించింది. కేవలం మద్దతు తెలపడమే కాకుండా, ప్రభుత్వం దిగివచ్చే వరకు ఈ గళం విశ్రమించబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. నర్సంపేట డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం సహజ మరణం కాదని, అది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆయన ధ్వజమెత్తారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, గొంతెమ్మ కోరికలు కాకుండా వారు అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను బేషరతుగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది గులాబీ సైనికులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కూడా వెనకాడరని హెచ్చరించారు. వనమా వెంకటేశ్వరరావు, వనమా రాఘవ నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాలో నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, పాల్వంచ వంటి మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో



డిపో పరిసరాలు జనసంద్రమయ్యాయి. "కార్మికుల కడుపు కొట్టి కాలం గడుపుతామనుకోవడం ప్రభుత్వ భ్రమ" అని, కొత్తగూడెం గడ్డపై ఉధృతమయ్యే ఈ ఉద్యమం హైదరాబాద్‌ను కుదిపేస్తుందని వనమా ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కిలారు నాగేశ్వరరావు, దామోదర్ సహా పలువురు సీనియర్ నాయకులు పాల్గొని కార్మిక పక్షపాతిగా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వివిధ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు మహిళా నాయకురాళ్ల సమక్షంలో జరిగిన ఈ నిరసన, ప్రభుత్వ అసమర్థ పాలనపై ఒక బలమైన హెచ్చరికలా సాగింది.

# ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన: డ్రైవర్ శంకర్ గౌడ్‌కి ఘన నివాళి

**బోధన్ : ఏప్రిల్ 24 జన సంఘర్షణ**

రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె నేడు మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బోధన్ డిపో కార్మికులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నేడు మౌన ప్రదర్శన నిర్వహించారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, ఎటువంటి నినాదాలు చేయకుండా మౌనంగా ప్రదర్శన నిర్వహించడం ద్వారా కార్మికుల ఆవేదనను చాటిచెప్పారు. డ్రైవర్ శంకర్ గౌడ్ కి నివాళులు ఈ మౌన ప్రదర్శనలో భాగంగా, నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ అకాల మరణం పట్ల కార్మికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు పేర్కొన్న అంశాలు: శంకర్ గౌడ్ మరణం ఆర్టీసీ కుటుంబానికి తీరని లోటు. సమ్మె ఆశయ సాధన కోసం ప్రతి కార్మికుడు ఐక్యంగా పోరాడటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించి, ఇలాంటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఈ కార్యక్రమంలో డిపో జేఏసీ నాయకులు,ఉద్యోగులు అందరు పాల్గొన్నారు.




# డిచ్ పల్లి గ్రామంలో ఎన్‌సిసి ప్రత్యేక వేసవి శిబిరం

**బోధన్ ఏప్రిల్ 24 జన సంఘర్షణ**

తెలంగాణ యూనివర్సిటీ, నేషనల్ సర్వీస్ స్కీమ్ ఎన్ సి సి యూనిట్-×× ఆధ్వర్యంలో డిచ్‌పల్లి గ్రామంలో 2026 ఏప్రిల్ 24 నుండి 30 వరకు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరం ఈరోజు ప్రారంభమైనది. శిబిరంలో భాగంగా ఈరోజు నిర్వహించిన మొక్కల నాటకం (ప్లాంటేషన్ డ్రైవ్) ముఖ్య ఆకర్షణగా నిలిచింది. వాలంటీర్లు విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై తమ నిబద్ధతను చాటారు. ఈ సందర్భంగా వారు వివిధ ఔషధ మొక్కల గుణాలు, వాటి వైద్య ప్రయోజనాల గురించి గ్రామస్థులకు వివరించారు. స్థానికంగా లభించే మొక్కలను సంప్రదాయ వైద్యంలో ఎలా ఉపయోగించవచ్చో వివరించి, ఆరోగ్య పరిరక్షణలో సహజ విధానాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణతో పాటు జీవ వైవిధ్య సంరక్షణ మరియు సహజ వనరుల బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కలిగించే విదంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ఎన్ సి సి వాలంటీర్స్




మధ్యాహ్నం ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ సి సి వాలంటీర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సమీప ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి, చెత్త తగ్గింపు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై గ్రామస్థుల్లో అవగాహన కల్పించారు. ఈ శిబిరన్ని ఉద్దేశించి ప్రొఫెసర్ కె. అపర్ణ, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఎన్ సి సి మాట్లాడుతూ... విద్యార్థులను సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే వేదికగా ఈ కార్యక్రమాలు నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, తద్వారా నాయకత్వ లక్షణాలు, ఐక్యత, సామాజిక అవగాహన పెరుగుతాయని ఆమె సూచించారు. డా. అహ్మద్ అబ్దుల్ హలీమ్ ఖాన్, ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ సి సి యూనిట్ ××, మాట్లాడుతూ శిబిరాలు క్రమశిక్షణ నిబద్ధత, గ్రామీణ స్థాయిలో పనిచేయడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రొఫెసర్ జి. రాంబాబు, ప్రిన్సిపల్ ఉ చైర్మన్-యూనివర్సిటీ కాలేజ్, పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు పర్యావరణ రక్షణలో ముందుండి పనిచేసి, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిచ్‌పల్లి గ్రామ సర్పంచ్ యాదగిరి లోక్కిడి, గ్రామ అభివృద్ధి కమిటీ క్యాషియర్ ఆసాది రవీందర్, వార్డు సభ్యులు బల్లా బాలకృష్ణ, మేకల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమం

◆ **నెహ్రూ నగర్ లో 20 సీసీ కెమెరాలు ప్రారంభించిన పోలీస్ కమిషనర్**

**బోధన్ : ఏప్రిల్ 24 జన సంఘర్షణ**

శుక్రవారం సాయంత్రం సమయంలో ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయం యందు 20 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు







చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని హెల్మెట్, సీట్ బెల్టు తప్పనిసరి ధరించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్ఫోన్ వాడకం నిషేధించాలని అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినట్లయితే సంబంధిత పోలీసు వారికి తెలియజేయాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సెల్ ఫోన్‌కి వచ్చేటటువంటి మెసేజ్‌ను ఎవరు కూడా ఫార్వర్డ్ చేయవద్దని, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన సమాచారం ఎవరికి కూడా తెలియజేయవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసిపి ప్రకాష్, నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ, సురేష్ కుమార్ టౌన్ సిక్స్ ఎస్సై విట్టల్ రావు, ఉప సర్పంచ్, ఇమ్రాన్ ఖాన్, రామ్ నగర్ సర్పంచ్ స్వామి గౌడ్, తురాజ్ ఖాన్, అమానుల్లా మాజీ సర్పంచ్, గ్రామ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి

◆ **చికిత్స పొందుతూ మృతి**
◆ **శంకర్ గౌడ్ మృతితో వరంగల్ బందుకు పిలుపు**
◆ **కాంగ్రెస్ మినహా అన్ని పార్టీలు బందుకు మద్దతు**
◆ **ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడుతున్న ఆర్టీసీ జేఏసీ**

**తెలంగాణ వరంగల్ నర్సంపేట్/ఏప్రిల్24/(జన సంఘర్షణ)**

తెలంగాణ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె సాగిస్తుండగా వరంగల్ జిల్లా నర్సంపేట్ బస్టాండ్ లో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ గురువారం మధ్యాహ్నం ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యమునకు పాల్పడ్డాడు. 90 శాతం కాలిన గాయాలతో ఉన్న శంకర్ గౌడ్ ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటన పట్ల కాంగ్రెస్ పార్టీ మినహా అన్ని పార్టీలు వరంగల్ బందుకు పిలుపునిచ్చాయి. శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యగా ఆర్టీసీ జేఏసీ నాయకులు వెల్లడిస్తున్నారు. ఈయన సమయంలో ప్రభుత్వం స్పందిస్తే శంకర్ గౌడ్ ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. శంకర్ గౌడ్ మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లానర్సంపేట తెలంగాణ ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్గౌడ్ (55) మృతిచెందారు. 80 శాతానికి పైగా కాలిన గాయాలతో హైదరాబాద్లోని అపోలో డీఆర్డీవో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఆర్టీసీ సమ్మెలో భాగంగా గురువారం తెలంగాణలో పలుచోట్ల సంస్థ కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్గా పనిచేస్తున్న శంకరౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పటించుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ నర్సంపేట బస్టాండ్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే ఆయన్ను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు.







## ఇల్లందులో వృథాగా 'భగీరథ' జలాలు - అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

◆ **ఒకవైపు దాహం.. మరోవైపు నిర్లక్ష్యం: ఇల్లందులో ఉప్పొంగుతున్న భగీరథ లీకేజీలు --రోడ్లపైనే చుక్కల జలం వృథా!**

**ఇల్లందు ఏప్రిల్ 24 (జన సంఘర్షణ)**

ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం, ఇల్లందులో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల నీటి వృథాకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. శనివారం ఇల్లందు రైల్వే బ్రిడ్జి ప్రాంతంలో ప్రధాన పైప్‌లైన్ ఒక్కసారిగా లీకేజీకి గురికావడంతో, వేల లీటర్ల శుద్ధి చేసిన జలం రోడ్డుపై ఏరులై పారింది. భానుడి భగభగలతో చుక్క నీటి కోసం జనం అల్లాడుతున్న తరుణంలో, ఇలా కళ్ల ముందే నీరు మురికి కాలువల పాలవుతుండటం స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పైపులు పగులుతున్నా, శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక మరమ్మతులతో కాలయాపన చేస్తున్న అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం సాంకేతిక లోపం మాత్రమే కాదు, ప్రజల ఆస్తి అయిన నీటిని కాపాడటంలో బాధ్యతారాహిత్యం కూడా అని, ఇప్పటికైనా సంబంధిత యంత్రాంగం నిద్రమత్తు వీడి యుద్ధ ప్రాతిపదికన ఈ లీకేజీలను అరికట్టాలని ప్రజా క్షేత్రం డిమాండ్ చేస్తోంది.



## డీసీఎం వ్యాన్ .. ద్విచక్ర వాహనాన్ని ఢీ వ్యక్తి మృతి

◆ **వ్యాన్ డ్రైవర్ పరార్..**

**కామారెడ్డి బాన్స్వాడ /ఏప్రిల్24/(జన సంఘర్షణ)**

కామారెడ్డి జిల్లాబాన్సువాడ పట్టణంలో తాడ్ కోల్ చౌరస్తాలో డీసీఎం వ్యాన్, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా వాహనంపై ఉన్న వ్యక్తి వాహనం కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనానికి ఢీ కొట్టిన డీసీఎం వాహనం డ్రైవర్, వాహనాన్ని వదిలివేసి పారిపోయాడు. మృతి చెందిన వ్యక్తి ఎవరన్నది పోలీసులు ఆరా తీస్తున్నారు.



## సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన చైతన్య రెడ్డి, ఐపిఎస్.

**బోధన్: ఏప్రిల్ 24 జన సంఘర్షణ**

సంగారెడ్డి జిల్లా సురక్ష సంగారెడ్డి జిల్లా నూతన అదనపు ఎస్పీగా చైతన్య రెడ్డి, ఐపిఎస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాద పూర్వకంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు చైతన్య రెడ్డి, ఐపిఎస్, 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో ఏళ్ల వేళల అందుబాటులో ఉంటానని తెలిపారు.




## మరో ఆర్టీసీ డైవర్ ఆత్మహత్యాయత్నం

**తెలంగాణ /ఏప్రిల్24/(జన సంఘర్షణ)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఆర్టీసీ కార్మికులకు ఎన్నో వరాలు ఇచ్చి ఇప్పుడు వాటిని నెరవేర్చడానికి ముందుకు రాకపోవడంతో ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె కొనసాగుతుంది. వరంగల్ జిల్లా నర్సంపేట్ బస్టాండ్ శంకర్ గౌడ్ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రాన్ని కల్చివేసింది. విషయంలో బారాస నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడుతుంటే. మరొకవైపు ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రభుత్వంతో చర్చలు జరుపుతుండగా హనుమకొండలో మరో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భూపాలపల్లి డిపోలో డ్రైవర్గా పనిచేస్తున్న రవీందర్ అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. బాధితుడైన రవీందర్ను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన ఆర్టీసీ డ్రైవర్ల సమస్యలపై మరోసారి చర్చకు దారితీసింది.



## మారుతీ కారు ఎవరు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు

**పొతంగల్ /ఏప్రిల్24/ (జన సంరక్షణ)**

కేసు యొక్క వివరాలు ఏమనగా పోతంగల్ గ్రామానికి చెందిన మహమ్మద్ జుమ్మా ఖాన్ అనే వ్యక్తి తన పాత మారుతీ కార్ ను తన ఇంటి ముందర గల కాళి స్థలంలో ఉంచేవాడు. శుక్రవారం రోజున అర్ధరాత్రి గంటల మధ్య సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తన కార్‌కు నిప్పు అంటించినారు. దాని వలన అతని కార్ కాలిపోయింది, కార్ పక్కనే ఉన్న జంగం విట్టల్ కు చెందిన టీవీఎస్ ఎక్సెల్ బండి కూడా కొంత కాలింది అని జుమ్మా ఖాన్ దరఖాస్తు ఇవ్వగ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.



# ఘనంగా శ్రీచైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు

-ముఖ్య అతిథులుగా సింగిరెడ్డి పద్మారెడ్డి,కొత్త కిషోర్ గౌడ్







**బోడుప్పల్ :**
మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వివేకలలో ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026 -27 విద్యా సంవత్సరం వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు అత్యుత్తమ విద్యా బోధన చేస్తూ తక్కువ కాలంలోనే పలుచోట్ల నూతన శాఖలను ఏర్పాటుచేసి అందరి ఆదరా భిమానాలను పొందుతూ విజయవంతంగా నడిపిస్తున్న శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గుండు రాజుని పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్ :**



హబ్సిగూడసీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండు రాజు తల్లి గుండు అనసూయ మంగళ వారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, రాజు గారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కంది శ్రవణ్ రెడ్డి గారు,డివిజన్ అధ్యక్షులు విజయ్,పేట మురళి ముదిరాజ్ ,వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్,అజ్జిజ్,మలు నాయక్,వాసు నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు భీమ్ ఆర్మీ రాష్ట్ర చీఫ్ మద్దతు

**జహీరాబాద్:**




జహీరాబాద్ పట్టణంలోని బస్ డిపో వద్ద కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర చీఫ్ సిద్దు రావణ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. శుక్రవారం సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఆయన.. ప్రభుత్వం వెంటనే మొండివైఖరి వీడి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్ :**
కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కూడా నూతన కమిటీ సభ్యులందరికీ శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలానగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించి, అవసరమైన అన్ని అంశాలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

-ఉపాధి,విద్య,ఆరోగ్యం హక్కులు సాధించే వరకు ఏఐవైఎఫ్ పోరాటం

-ఆవిర్భావ దినోత్సవ గోడ పత్రికను విడుదల చేసిన నేతలు

-ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు,కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర




**ఉప్పల్ :**
ఉపాధి,విద్య,ఆరోగ్యం హక్కులు సాధించే వరకు ఏఐవైఎఫ్ పోరాటం సల్పిస్తుందని, దేశ యువత భవిష్యత్తును కార్పొరేట్ దోపిడీ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు చీకటిలోకి నెడుతున్న ఈ సమయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 67వ ఆవిర్భావ దినోత్సవంను పోరాట దినంగా నిర్వహించనుందని, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం అనే మార్గదర్శక సూత్రాలతో, దేశాన్ని సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్య విలువల వైపు తీసుకెళ్లడం ఏఐవైఎఫ్ లక్ష్యమన్నారు . కానీ నేటి పాలక వర్గాలు కార్పొరేట్ అనుకూల విధానాలతో యువతకు ఉపాధి, విద్య, ఆరోగ్య హక్కులను దోచుకుంటున్నాయన్నారు .యువజన శక్తి మేల్కొని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైనదన్నారు. అందరికీ ఉచిత, నాణ్యమైన విద్యను హక్కుగా అమలు చేయాలని, ప్రజలకు ఉచిత, సమగ్ర ఆరోగ్య సేవలు కల్పించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం (BNEGA) వెంటనే అమలు చేయాలని, దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించే ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలని,మహిళలపై జరుగుతున్న అణచివేతలను అరికట్టి సమాన హక్కులు కల్పించాలని, కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే శక్తులను ఎదుర్కోవాలని,పర్యావరణాన్ని నాశనం చేసే విధానాలను నిలిపి, ప్రజా ప్రయోజనాలను కాపాడాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వ్యవస్థలను రద్దు చేసి స్థిర ఉపాధి కల్పించాలని, కార్మిక హక్కులను రక్షించి, శ్రమజీవుల గౌరవాన్ని నిలబెట్టాలని, రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను అడ్డుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, భగత్ సింగ్, చెగువేరా, డా.బి.ఆర్. అంబేద్కర్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్ వంటి మహనీయుల విప్లవ ఆలోచనలు ప్రతిబింబిస్తూ, యువతకు పోరాట మార్గాన్ని సూచిస్తుందన్నారు,ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు సల్మాన్ భేగ్,షేక్ మహమూద్ పాల్గొన్నారు.

# శంకర్ గౌడ్ ది ఆత్మహత్య కాదు..సర్కార్ చేసిన హత్యే!..

- రెండేన్నరేళ్లుగా తీరని అన్యాయం.. మనస్తాపంతోనే ఆర్టీసీ కార్మికుడి బలి..
- పార్థివదేహాన్ని డిపోకు తీసుకెళ్లనివ్వకపోవడం దుర్మార్గం..
- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం,ఉద్యోగం ఇవ్వాలి

మెచ్చా నాగేశ్వరరావు



**చంద్రుగొండ/**
కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్, ప్రాణాలను బలితీసుకున్నాయని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు, తీవ్రంగా ధ్వజమెత్తారు. శంకర్ గౌడ్ ఆత్మబలిదానంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయన, ఇది ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేసి, కార్మికుల కష్టాలను తీరుస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ పార్టీ, రెండున్నరేళ్లుగా వారిని నిలువునా వంచిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న నమ్మకద్రోహాన్ని, నిరంతర వేధింపులను తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆయన పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి తోటి కార్మికులు నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలనకు పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని ఓదార్చాల్సింది పోయి, పోలీసులతో అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. తక్షణమే బాధితుడి కుటుంబానికి ఒక కోటి రూపాయల భారీ పరిహారం ప్రకటించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలని. డిమాండ్ చేశారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అప్పాయింటెడ్ డే'గా ప్రకటించి ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆయన స్పష్టం చేశారు.శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలనీ ప్రార్థించారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

- డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
- ఆత్మహత్యలు వద్దు..పోరాడి సాధించుకుందాం
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**హనుమకొండ/ :**
ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,సమ్మె పై మొండి వైఖరి వీడాలని,ఈ విషయంలో సమ్మెపై ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు హనుమకొండలోని కాళోజి సెంటర్ లో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యం అని, సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ప్రైవేటు డ్రైవర్ల ప్రయోగం ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని, సమ్మెను అణచివేసేందుకు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెడుతున్న ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని అన్నారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, కార్మికులకు సంబంధించిన సంక్షేమ చేశారు గత ఎన్నికల సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, అదేవిధంగా ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆర్టీసి కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఆత్మహత్యలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్ ఎ స్టాలిన్, వుట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, ఎదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, వేల్పుల సారంగపాణి, గుంటీ రాజేందర్, అలువాల రాజు, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మామునూరి దామోదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాయిపల్లిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

రాయికోడ్:రాయికోడ్ మండలం రాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక సభ నిర్వహించారు. సర్పంచ్ కాశీ బస్వారాజ్ పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో పంచాయతీ పాలన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి రాయిపల్లి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. గ్రామ ప్రజల సహకారం ఉంటే వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
25 ఏప్రిల్ 2026

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ, ఏఐటీయూసీ సంఘీభావం



**హనుమకొండ/ :**
రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకున్న సందర్భంగా, హనుమకొండ బస్టాండ్లో కార్మికులు జరుపుతున్న నిరసన కార్యక్రమానికి సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి,రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్,జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెకు కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు మాత్రమే కాకుండా ప్రజల నుండి కూడా విస్తృత మద్దతు లభిస్తోందని వారు స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై చర్చలు జరిపి, సమస్యకు పరిష్కారం కనుగొనాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని, కార్మిక నాయకులతో చర్చలు ప్రారంభించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.ఇప్పటికే పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది తీవ్ర ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కలవరపరుస్తున్నాయని అన్నారు. కార్మికులు నిరాశకు లోనవకుండా, ఆత్మహత్యల వంటి దురదృష్టకర చర్యలకు పాల్పడకుండా, ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని వారు పిలుపునిచ్చారు.“పోరాటమే మార్గం -- ఐక్యతే శక్తి” అంటూ కార్మికులకు సంఘీభావం తెలిపారు.ఈ సమ్మె కార్యక్రమంలో జేఏసీ నాయకులు వేముల కుమార్ స్వామి, యాకస్వామి, ఎన్.ఎం.యు, రీజనల్ సెక్రెటరీ, టీ.ఎం.యూ. రీజనల్ సెక్రెటరీ జితేందర్ రెడ్డి, మహిళా కండక్టర్లు, డ్రైవర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# చర్లపల్లిలో వర్షపు నీటి కాలువ పనులు వేగవంతం చేయాలి

**-హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిని కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



**ఉప్పల్, :**
చర్లపల్లి డివిజన్లో రూ. 1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వర్షపు నీటి కాలువ నిర్మాణ పనులకు సంబంధించిన పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేసి వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సీవీ ఆనంద్ను కోరారు. మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన ఈ విజ్ఞప్తి చేశారు.చర్లపల్లి ప్రాంతంలో ఈ పనులు పూర్తయితే వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత కాలపట్టికలో పూర్తి చేసేందుకు సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులకు అవసరమైన సహకారం అందేలా జైలు శాఖ అధికారులకు సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

# ఆత్మబలిదానాలు వద్దు

- -జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం
- - హక్కుల కోసం పోరాటం చేద్దాం...
- - ఆర్టీసీ కార్మికులకు దళిత హక్కుల పోరాట సమితి మద్దతు

**ధర్మసాగర్ :**
ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కొనసాగుతున్న ఆందోళనకు హనుమకొండ జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రాజారపు రత్నం మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ, కార్మికులు హక్కుల కోసం ధైర్యంగా పోరాడాలని, కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడదాం... కార్మికుల పొట్ట కొట్టే విధానాలను ప్రశ్నిద్దాం. కానీ ప్రాణత్యాగం సమస్యకు పరిష్కారం కాదు. మీ ప్రాణం అమూల్యమైనది. మీరు కోల్పోతే నష్టపోయేది మీ కుటుంబమే తప్ప ప్రభుత్వం కాదు” అని ఆవేదనతో తెలిపారు.ఆర్టీసీ కార్మికులారా... ఆవేదనలో



ఆత్మహత్య శరణ్యం అనుకోకండి. మీరు గతంలో ఎన్నో హక్కులు సాధించారు. మీ వెనుక మీ కుటుంబం ఉంది... మీకు అండగా మేమున్నాము. న్యాయమైన డిమాండ్ల కోసం మీరు చేస్తున్న పోరాటంలో మేము మీ వెంటే ఉంటాం. ప్రభుత్వం దిగివచ్చి మీ సమస్యలు పరిష్కరించే వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, న్యాయం జరగకపోవడంతో ఈ ప్రభుత్వాన్ని ఆశ్రయించామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా డిమాండ్ల పరిష్కారంలో ఆలస్యం చేస్తోందని విమర్శించారు. జేఏసీ నాయకులతో వెంటనే చర్చలు జరిపి, కాలయాపన చేయకుండా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఇటీవల నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మాహుతి ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వడంతో పాటు, కుటుంబ సభ్యుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు.భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ధైర్యంగా ఉండండి... కలిసి పోరాడుదాం” అని కార్మికులకు పిలుపునిచ్చారు.

# అధికారుల కన్ను కప్పి అక్రమ నిర్మాణాలు....

- **ప్రభుత్వ భూమిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు......**
- **బోర్డులు పెట్టిన ఆగని నిర్మాణం.....**
- **నిద్రమత్తులో మండల రెవెన్యూ అధికారులు.....**
- **ఇలాగైతే ప్రభుత్వ భూములు కాపాడేది ఎవరు....?**
- **మండల ప్రజలు**

**చంద్రుగొండ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం తుంగారం గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నంబరు 35 లో అక్రమ నిర్మాణాలను చేస్తున్న కూడా మండల రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. చట్టానికి చుట్టాలు ఎవరూ కాదన్నది పాత సామెత . పైసలిస్తే చట్టానికి చుట్టాలవుతారు అన్నది ఇప్పుడు ఉన్న కొత్త సామెత చంద్రుగొండ మండలంలో రుజువు అవుతుంది. ప్రభుత్వ భూమిని వెంచర్లుగా చేసి అమ్ముతున్నారని పలు పత్రికలలో వచ్చిన ఆరోపణలపై స్పందించిన రెవెన్యూ అధికారులు బోర్డు పాతారు . మరి అధికారులకు ముడుపులు ముట్టాయి లేక పెద్ద అండదండలు చూసుకుని ఎవరు ఏమి చేయలేరు అన్నట్టుగా అక్రమ నిర్మాణాలు కడుతున్నారు. పంచాయతీ అధికారులు కి అన్ని విషయాలు తెలిసినా




కూడా పై అధికారులే మౌనంగా ఉండడం చిన్నస్థాయి అధికారులు మేమేం చేస్తామన్న రీతిలో ఉంటున్నారు. గ్రామాలలో అక్రమ కట్టడాలు కట్టిన పంచాయతీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని కి వ్యతిరేకమైన చర్య చేస్తున్నాడు అంటే తన వెనక పెద్ద హస్తమే ఉందంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇదే విషయంపై మండల తాసిల్దార్ కు ఫోన్ చేయగా మొదటగా మేము అధికారులను పంపిస్తున్నాను అని చెప్పి తర్వాత నుంచి ఫోన్ కు అందుబాటులో రాలేదు మండల అధికారులు స్పందించకపోవడంపై అధికారులకు ముడుపులు ముట్టాయంటూ మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధికి నంది పలుకుతున్న సర్పంచ్ ఇంగే రవీందర్



**ధర్మసాగర్ :**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామంలోని పలు అభివృద్ధి పనులకు నంది పలుకుతున్న సర్పంచ్ ఇంగె రవీందర్ గత కొద్ది రోజులుగా లో వోల్టేజ్ తోటి ట్రాన్స్ఫార్మర్లు మోరాయించడం జరుగుతుంది ఇది గమనించిన సర్పంచ్ వెంటనే స్పందించి ధర్మసాగర్ ఏఈ కి విషయం తెలుపగా తక్షణమే లైన్ మెన్ కు చెప్పి మూడు సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్లు పెట్టించారు అనంతరం గ్రామస్తులు సర్పంచ్ మరియు ఏఈ లైన్ మెన్ మహేందర్ హెల్పర్ సాంబమూర్తి కి కృతజ్ఞతలు తెలియజేశారు

## ఆరెగూడెంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ :

**చిట్యాల,ఏప్రిల్ 24**
చిట్యాల మండలంలోని ఆరెగూడెం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకంను గ్రామీణ కూలీలు సద్వినియోగం చేసుకోని ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జింజి రాజు, పంచాయతీ కార్యదర్శి శారద, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ పాల్గొన్నారు..



Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co